క్లుప్తంగా

25 వరకు డిగ్రీలో అడ్మిషన్‌లకు గడువు

కంభం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20024-25 విద్యా సంవత్సరానికి ఈ నెల 25వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్ పాసైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమరోలు: మండల కేంద్రం కొమరోలులో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కొమరోలు, గోపాలునిపల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

సీతమ్మవారికి ఒడి బియ్యం, సారె సమర్పణ



సీతమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

మార్కాపురం టౌన్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చెన్నకేశవస్వామి గాలి గోపురం వద్ద ఉన్న పట్టాభిరామస్వామి ఆలయంలో సీతమ్మవారికి భక్తులు ఒడిబియ్యం, సారె సమర్పించారు. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి భక్తులు ఒడిబియ్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అధ్యక్షుడు చక్కా మాలకొండ నరసింహారావు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కుష్టు బాధితుల గుర్తింపు సర్వే ప్రారంభం



సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ శరత్ చంద్ర

పొదిలి: జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే గురువారం ప్రారంభమైంది. పట్టణంలోని ఒకటో సచివాలయం పరిధిలో తూర్పుపాలెంలో సర్వేను డాక్టర్ శరత్ చంద్ర పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలిచ్చారు. ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించే సర్వే వివరాల ఆధారంగా నివారణ చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయ, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వర్టు ఏర్పాటు చేయాలి



కల్వర్టు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

పొదిలి: మండలంలోని నందిపాలెం పరిధిలో పెద్దవాగుపై కల్వర్టు గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నందిపాలెం నుంచి కర్నూలు హైవేకు చేరుకోవడానికి వినియోగించే ఈ లింక్ రోడ్డులో నిత్యం ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఈ రోడ్డునే అధికంగా వినియోగిస్తారు. ఈ మార్గంలో పెద్దవాగుపై ఏర్పాటు చేసిన పైపు కల్వర్టు గతంలో వరదకు కొట్టుకుపోయింది. సంబంధిత అధికారులు స్పందించి పైపు కల్వర్టు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా సామూహిక కోటి కుంకుమార్చన



పూజల్లో మహిళ భక్తులు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లో శ్రీలక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సామూహిక కోటి కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్ భట్టర్, మురళీకృష్ణమాచార్యులు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉభయదాతలను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. ఆలయ నిర్మాణ, నిర్వహణ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, రవిశంకర్, పెరుమాళ్ల భాస్కర్, మల్లయ్య, పునుగుపాటి కోటేశ్వరరావు, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష



ర్యాలీలో పాల్గొన్న ఏడీజే శుభవాణి, న్యాయవాదులు, సిబ్బంది



ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు

● జిల్లా ఆరో అదనపు జడ్జి శుభవాణి

మార్కాపురం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి శుభవాణి పేర్కొన్నారు. గురువారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు సెంటర్ నుంచి గడియార స్తంభం వరకు కోర్టు సిబ్బంది, న్యాయవాదులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కిశోర్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు భూపని కాశయ్య, వై.అనీల్ కుమార్, పారా లీగల్ వలంటీర్లు ఆదినారాయణ, బాషా, ఆసీఫ్‌ఖాన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ

గిద్దలూరు రూరల్: ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రయాణంలో రక్షణ పొందవచ్చని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ అన్నారు. గిద్దలూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిద్దలూరు పట్టణంలో హైవే ఉన్నందున ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని, ద్విచక్ర వాహనదారులు జాగ్రత ఉంటూ హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలు నడపాలన్నారు. న్యాయవాదులు హెల్మెట్ చేతపట్టుకొని ప్రజలకు అవగాహన కల్పించారు. అడిషనల్ సివిల్ జడ్జి బి. మేరీసారా ధానమ్మ, స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్‌క్లాస్ తోట శ్రీనివాసులు, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు శేషశాయనరెడ్డి, ఉపాధ్యక్షుడు ఉస్మాన్ షరీఫ్, సెక్రటరీ ఉదయగిరి మల్లికార్జునరావు, సీఐ సోమయ్య, పారా లీగల్ వలంటీర్ మధుసుదన్‌రావు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ

పొదిలి: రోడ్డు ప్రమాదాల నివారణపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పొదిలి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష ర్యాలీని ప్రారంభించారు. సీఐ మల్లికార్జున మాట్లాడుతూ.. జాగ్రత్తలు తీసుకోవడం, రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. ర్యాలీలో ఎస్సై కోటయ్య, న్యాయవాదులు ఎస్ఎం బాషా, ఎంవీ రమణకిషోర్, షబ్బీర్, జి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పొదిలిలో ర్యాలీలో పాల్గొన్న జడ్జి ప్రత్యూష తదితరులు

ప్రారంభానికి నోచుకోని పబ్లిక్ టాయిలెట్స్

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ప్రారంభించకుండా వదిలేసిన పబ్లిక్ టాయిలెట్స్

కంభం: నిత్యం రద్దీగా ఉండే కందులాపురం కూడలిలో హైవేకు ఆనుకొని సచివాలయం పక్కన నిర్మించి ప్రారంభించకుండా వదిలేసిన పబ్లిక్ టాయిలెట్స్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకొస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కందులాపురం కూడలి పరిసరాల్లో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు అధికంగా ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ నుంచి బస్సుల్లో వచ్చే ప్రయాణికులు తెల్లవారు జామున ఈ ప్రాంతంలోనే బస్సులు దిగితుంటారు. రైళ్లలో దూరప్రాంతాల నుండిచి ప్రయాణాలు చేసి వచ్చిన ప్రయాణికులు ఆటోలో కందులాపురం కూడలికి చేరుకొని వారి ఊర్లకు బస్సుల్లో వెళ్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు, ప్రయాణికులు, విద్యార్థినీ, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కందులాపురం పంచాయతీ ఆధ్వర్యంలో కందులాపురం-2 సచివాలయం పక్కనే పబ్లిక్ టాయిలెట్స్ ఎన్నికలకు ముందే నిర్మించారు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అప్పుడు ప్రారంభానికి నోచుకోలేదు. ఎన్నికల కోడ్ ముగిసి రెండు నెలలు కావస్తున్నా నేటికీ పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన బాబా సప్తాహ పారాయణం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



పారాయణంలో పాల్గొన్న భక్తులు

● 650 మంది భక్తుల హాజరు

మార్కాపురం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మార్కాపురంలోని నెహ్రూ బజారులో ఉన్న సాయిబాబా మందిరంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా తలపెట్టిన బాబా జీవిత చరిత్ర సప్తాహ పారాయణం గురువారంతో ముగిసింది. సుమారు 650 మంది సాయి భక్తులు పారాయణంలో పాల్గొన్నారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు అష్టోత్తర పూజ నిర్వహించారు. గాయకులు కె.శైలజ, బి.భారతి, బాలరాజు, రంగనాయకులు తదితరులు భక్తిగీతాలు ఆలపించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో మందిర అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, ఉపాధ్యక్షులు నాగ గోపి, కోశాధికారి నాగరాజు, సభ్యులు పవన్, నాగేశ్వరరావు, కృష్ణమోహన్, కొండయ్య, రమేష్, వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

డిపోలో అవకతవకలపై విచారణ చేపట్టాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సంఘ సభ్యులు

● నాలుగో రోజుకు చేరిన నిరాహార దీక్ష

పొదిలి:

ఆర్టీసీ డిపోలో కొందరు అధికారులు పక్షపాతం చూపిస్తూ, సంస్థకు ఆర్థికంగా నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని, తక్షణమే ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అధికారుల పక్షపాత చర్యలకు నిరసనగా డిపో ఆవరణలో చేపట్టిన నిరాహార దీక్ష గురువారంతో నాలుగో రోజుకు చేరింది. ఎస్‌కే చాంద్‌బాష, ఎం.చిన్నయ్య దీక్షలో కూర్చున్నారు. సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, కొండయ్య వీరికి పూలమాలలు వేసి దీక్ష ప్రారంభించారు. శిబిరంలో నాయకులు మాట్లాడుతూ.. చార్జులు వేయకుండా డ్రైవర్లు, కండక్టర్లను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సెస్ పేరుతో కనిగిరి డిపోకు పంపించిన కార్మికులను తిరిగి డిపోకు తెప్పించి లీవ్ పొజిషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. చిన్న చిన్న పొరపాట్లకు కూడా కఠినమైన చర్యలు తీసుకుంటూ ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ఆర్థిక నష్టం కలుగజేయడం సరికాదన్నారు. 1-2019 సర్క్యులర్ అమలు చేయకుండా డీఎం ఇష్టానుసారం పనిష్మెంట్ ఇస్తున్నారని, అయిన వారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో చందంగా డీఎం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ మస్టర్లు ఇచ్చి సంస్థకు ఆర్థికంగా నష్టం చేస్తున్న ఎస్‌టీఐపై విచారణ చేయలేదని, హైర్ బస్సులకు సంబంధించిన ఎస్ఆర్‌లు మాయమైతే ఇప్పటి వరకు అధికారులు స్పందించలేదన్నారు. అవకతవకలపై రీజినల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి పురోగతి లేదని చెప్పారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేంత వరకు నిరాహార దీక్ష కొనసాగిస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే కందిపప్పు



కంది పప్పు అందజేస్తున్న ఆర్డీఓ

కొనకనమిట్ల: బహిరంగ మార్కెట్‌లో కంటే తక్కువ ధరకు కంది పప్పు, బియ్యం అందజేస్తున్నట్లు ఆర్డీఓ జాన్ ఇర్విన్ పేర్కొన్నారు. గురువారం కొనకనమిట్లలోని రెండు దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కంది పప్పు, బియ్యం అందజేశారు. కంది పప్పు మార్కెట్ ధర రూ.180 కాగా రూ.160, బియ్యం రూ.55 కాగా రూ.49కు అందిస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాజిదా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయుడు బొర్రయ్య

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.బొర్రయ్య నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వీఏఏ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. హెచ్ఎం మౌలాలి, ఉపాధ్యాయులు షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి జక్కం మెర్సీ

కౌలు రైతులకు అవగాహన

మార్కాపురం రూరల్: మండలంలోని కొండేపల్లి, రామచంద్రాపురం, మాల్యవంతునిపాడు గ్రామాల్లో కౌలురైతులకు పంట సాగుదారు హక్కు పత్రంపై గురువారం అవగాహన కల్పించారు. ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, కౌలు రైతులు తమ దరఖాస్తులను వీఆర్‌ఓలకు అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న మూడు రోజుల్లోగా కౌలు కార్డులు ఇస్తామని చెప్పారు. సమావేశంలో వీఆర్‌ఓలు, వీఏఓలు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: కౌలుకు పొలం చేసుకునే రైతులు సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. గురువారం మండలంలోని పిటికాయగుళ్ల, జేసీ అగ్రహారం ఆర్‌బీకేల్లో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డులు పొందిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం వర్తిస్తాయని వివరించారు. భూమి యజమాని అంగీకారపత్రం, 1 బీ, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో దరఖాస్తు అందజేసిన మూడు రోజులకు సీసీఆర్‌సీ కార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణాన్ని వినియోగించుకోవాలి

కొమరోలు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ మల్లికార్జుననాయుడు సూచించారు. పట్టణంలోని చిన్నపీర్ల చావిడి వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాన్ని ఎంపీడీఓ నరసింహారావుతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్న నిత్యావసరాలను ప్రభుత్వ రాయితీపై తక్కువ ధరలకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో మంచిరకం బియ్యం 55 రూపాయలు ఉండగా 49 రూపాయలకే అందిస్తున్నామని, కందిపప్పు 181 రూపాయలు ఉండగా 160 రూపాయలకే అందిస్తున్నట్లు తెలిపారు.



నిత్యావసరాలు అందిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

నూతన ఎస్పీకి శుభాకాంక్షలు





ఎస్పీ దామోదర్‌కు పూలమొక్క అందిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు ఎస్సై కోటయ్య

మార్కాపురం/పొదిలి: జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏఆర్ దామోదర్‌ను మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు గురువారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పొదిలి సీఐ మల్లికార్జున, ఎస్సై కోటయ్య తదితరులు ఎస్పీకి పూల మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం ప్రారంభం

కంభం: స్థానిక స్టార్ సినిమా హాలు ఎదురుగా ఉన్న రైస్ మిల్‌లో మార్కెట్ ధరకంటే తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రామయ్య తెలిపారు. గురువారం ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. కందిపప్పు కేజీ రూ.160, బియ్యం స్టీమ్డ్ బీపీటీ/సోనామసూరి కేజీ రూ.49, పచ్చి బీపీటీ/సోనామసూరి రకం కేజీ రూ.48 ప్రభుత్వం నిర్దేశించిందని, ఈ ధరల ప్రకారమే అమ్మడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, గోడౌన్ డీటీ ప్రసాద్, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి బ్రహ్మయ్య, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు స్టార్‌బాషా, కోటయ్య, కేతం శ్రీను, తోట శ్రీను పాల్గొన్నారు.



కందిపప్పు అందజేస్తున్న ఎంపీపీ తులశమ్మ

వంగపాడులో పీర్ల గ్రామోత్సవం



వంగపాడులో పీర్ల గ్రామోత్సవం



పురవీధుల్లో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

బేస్తవారిపేట: మండలంలోని వంగపాడులో గురువారం మొహర్రం ఘనంగా జరుపుకున్నారు. అర్ధ రాత్రి నుంచి పెద్ద షరిగత్ సందర్భంగా గ్రామంలోని పురవీధుల్లో గ్రామోత్సవం చేశారు. హిందూ, ముస్లింలు ప్రత్యేకంగా అలంకరించిన పీర్లకు పూజలు చేశారు. సాయంత్రం డప్పు, వాయిద్యాలతో పీర్ల చావిడి నుంచి గ్రామోత్సవంగా గ్రామం చివరకు తీసుకొచ్చారు. అక్కడ ప్రార్థనలు చేశారు

కొమరోలు: స్థానిక పెద్దపీర్లచావిడి, చిన్నపీర్ల చావిడిల వద్ద కులమతాలకు అతీతంగా నాలుగు రోజులుగా మొహర్రం వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరి రోజు అయిన గురువారం మొహర్రం వేడుకల సందర్భంగా పెద్ద సంఖ్యలో ముస్లింలు, హిందువులు గుండాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. పురవీధుల్లో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

మార్కాపురం టౌన్: మొహర్రం పండగను పురస్కరించుకుని పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని పట్టణంలో గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ధర్మ పరిరక్షణ కోసం అశువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ముస్లింలు ఉపవాస దీక్ష చేపట్టారు. పట్టణంలోని గొర్లగడ్డ, తూర్పువీధి, కొండారెడ్డి కాలనీ, విజయటాకీస్ తదితర పీర్లచావిళ్లలో పీర్లను తీసి గుండంలో నడుచుకుంటూ వెళ్లారు. పీర్లకు దట్టీలు, పూలతో అలంకరించిన గుమ్మటాలు తొడిగి వెండి గొడుగులు, ఊయలు, కర్ణాభరణాలు, నాగాభరణాలతో అలంకరించారు. భక్తులు పీర్లకు వారు పోసి బొరుగులు, పప్పులు, బెల్లం సమర్పించారు. ముజావర్లు పీర్లను ఎత్తుకుని భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. భక్తులు గుండంలో కొబ్బరి కాల్చారు. చాందిరిలో పీర్లను ఉంచి పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముజావర్లు, మతపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



పగలు ఉత్సవంలో గొర్లగడ్డ పీర్లు



చాందిరి నగరోత్సవంలో తూర్పువీధి పీర్లు



చాందిరిలో గొర్లగడ్డ పీర్ల ఊరేగింపు